◆ ఈ వారం కథ

పున్నమి చంద్రుని అందుకోవాలని పైకి పైకి వెళ్లి అందుకోలేక మళ్లీ సముద్రంలోకి వచ్చేస్తున్న కెరటాలను చూస్తున్నారు శరత్, శ్వేత. వారిద్దరూ ప్రేమికులు.

"శరత్! మన ప్రేమని మనం ఇట్లాగే అందుకోలేక పోతామేమో!" శరత్ మౌనంగా వుండిపోయాడు.

"మనం సింహాచలం వెళ్లి పెళ్ళి చేసుకుని కొన్నాళ్లు మా ఇంట్లో వుందాము."

"అమ్మో... ఇంకేమైనా వుందా! మా అమ్మకి బి.పి., నాన్నకి గుండె జబ్బు... నేనిట్లా చెప్పాపెట్టకుండా పెళ్లి చేసుకుంటే వాళ్లకేమైనా అయితే మనం జీవితాంతం గిల్టీకాన్షియస్‌తో సంసారం చెయ్యలేము" అన్న శరత్ మాటలు శ్వేతకి కోపం తెప్పించాయి.

"మరైతే వాళ్లు చూపించిన అమ్మాయి మెడలో మూడుముళ్ళూ వేసి వాళ్లిచ్చిన కట్నం డబ్బులు జేబులో వేసుకో..."

"అరే...! మైడియర్. అంతలోనే అంత కోపం అయితే ఎలా?" శ్వేత చేతిని తన చేతిలోకి తీసుకుని "వాళ్లకేదైనా అవుతుందని భయపడుతున్నానే కానీ వాళ్లు చూపించిన అమ్మాయి మెళ్లో తాళి కడతాననడం లేదు. అందుకేదైనా ఉపాయం ఆలోచిద్దాము."

* * *

"రండి... రండి..." వెంకటసుబ్బయ్య శర్మ దంపతులను ఆదరంగా ఆహ్వానించారు.

కూతురు ప్రేమ సంగతీ, వాళ్ల సమస్యనీ విన్న తండ్రి కూతురుకి ఓ ఉపాయం చెప్పాడు.

దాని ఫలితమే శరత్ తల్లిదండ్రులు శ్వేత పెళ్లిచూపులకి వచ్చారు.

"కూర్చోండి..." అని కుర్చీలు చూపించాడు సుబ్బయ్య. తల్లిలేని శ్వేత తనే కాఫీ, ఫలహారాలు తయారుచేసింది.

అందరూ కాఫీ ఫలహారాలు పూర్తిచేశారు.

"మా అమ్మాయి శ్వేత మీ అందరికీ నచ్చింది కాబట్టి కట్నం కానుకల సంగతి ఇప్పుడే మాట్లాడేసుకుందాము."

సుబ్బయ్యగారు అనగానే శరత్ ఆశ్చర్యంగా ఆయన వంకా, కోపంగా శ్వేత వంకా చూశాడు.

శ్వేత, నవ్వుతూ చూపులతో "నిదానం... నిదానం" అన్నట్లుగా శరత్ వంక చూసింది.

శర్మగారు భార్య వైపు చూశారు అది ఆమెకి సంబంధించిన విషయం అన్నట్లుగా. ఆమె గొంతు సవరించుకుని మొదలుపెట్టింది.

"పెద్దాడికి పాతిక వేలు రొక్కం ఆ రోజుల లోనే ఇచ్చారు. పిల్లకి ఇరవై తులాల బంగారం పెట్టారు. ఆడబడుచు, వియ్యపురాలు లాంఛనాల కింద పది వేలు ఇచ్చారు..." అంటున్న తల్లిని బాధగా చూశాడు.

తల్లికి మాత్రమే వినపడేట్లుగా "ఏమిటమ్మా ఇదంతా! ఇంటి దగ్గర చిలక్కి చెప్పినట్లుగా చెప్పి తీసుకొస్తే ఇప్పుడీ బేరాలు ఏమిటమ్మా?"

"నువ్వూరుకోరా! నీకేం తెలీదు... నిన్ను కని, పెంచి ఇంత చదువు చెప్పించి ఇంతవాడిని చెయ్యడానికి మేము ఎంత ఖర్చు పెట్టిందీ నీకేం తెలుసు? నువ్వేం మాట్లాడకుండా కూర్చో..."

"శ్వేతని కూడా వాళ్ల అమ్మా, నాన్నా మీకు మల్లేనే కన్నారు. బోలెడు డబ్బు ఖర్చుపెట్టి పెంచి పెద్దచేసి చదువు చెప్పించారు. మరి ఆయనెవరి నడుగుతారా ఖర్చంతా?"

"శ్వేత ఆడపిల్ల. ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రులు కట్నాలు ఇచ్చుకోవాల్సిందే..."

"అవునండీ, మీరు చెప్పింది అక్షరాలా నిజం. నా బిడ్డ మీ ఇంట సుఖంగా జీవితం గడిపేందుకు నేనెంతైనా ఖర్చుపెట్టడానికి సిద్ధంగా వున్నాను..." అన్నాడు శ్వేత తండ్రి.

శ్వేత నవ్వూ, ఆమె తండ్రి మాటలూ చూసి 'ఈ ఎత్తుగడ ఏమిటో చూడాలి' అనుకున్నాడు శరత్.

శ్వేత, శరత్‌ల వివాహం వైభవంగా జరిగింది.

మూడు నిద్రలైనయ్యి.. ఆ రోజు—

కొత్త కోడలిని తీసుకుని వెళ్లాలి శర్మ దంపతులు.

పది గంటలవుతున్నా కొడుకు, కోడలు గదిలోంచి రాకపోతే శరత్ తల్లి తలుపు తట్టి లేపింది.

"ఏమిటమ్మా?..." అని విసుక్కుంటూనే శరత్ లేచి మొహం కడుక్కుని నిదానంగా కాఫీ తాగి పేపరు చదువుతున్నాడు.

"ఏమిట్రా ఇంకా అట్లాగే కూర్చున్నారు? తొందరగా బయలుదేరండి. మళ్లీ వర్జ్యం వస్తుంది."

"ఎక్కడికి నాన్నా...?"

# కట్నం కాటుకి...



— ఎ. సువర్ణ

"ఎక్కడికేమిట్రా! మనింటికే!"

"నన్ను అమ్మేశారుగా నాన్నా శ్వేతకి. ఆమె తండ్రి మీరడిగినంత డబ్బు ఇచ్చి మీ దగ్గర నుంచి నన్ను కొని శ్వేతకి ఇచ్చేశారుగా. అమ్మిన వస్తువుని మళ్లీ తీసుకుపోతాననడం అన్యాయం నాన్నా..." అన్నాడు శరత్.

"శరత్ ఏమిట్రా తలతిక్క మాటలు? తల తిరుగుతోందా ఏమిటి?"

"ఎందుకమ్మా అట్లా కేకలేస్తావు? నన్ను పెంచి పెద్దవాడిని చేసి, చదువుసంధ్యలు చెప్పించినందుకు చేసిన ఖర్చంతా శ్వేత నాన్నగారు మీకు చెల్లించారు. కూతురు మీద అంత ప్రేమ వుంది కనకనే ఆయనంత ఖర్చుచేసి కూతురుకి నచ్చి ప్రేమించినవానితో పెళ్లి చేశారు. మరి... నన్ను కన్న మీరు మీ రక్తంలో రక్తం అయిన నాకు చేసిన ఖర్చంతా ఏ మాత్రం ముఖపరిచయం లేని ఈయన దగ్గర నుంచి వసూలు చేశారు!"

"చాల్లేరా, అతితెలివితేటలు చూపించకు. ప్రపంచంలో లేని విడ్డూరమేదీ మేం చెయ్యలేదు..."

"అయితే ఇందులో కూడా విడ్డూరమేం లేదమ్మా. నేనింతవాడినైనందుకు సంతోషించే తల్లిదండ్రులే నాకు కావాలి. ఈ ఇంట్లో మనుషుల మధ్య ప్రేమ వుంది. దానికి విలువ వుంది. నేనిట్లాంటి ఇంట్లోనే వుంటాను. మీరు వెళ్లండి. నేను రాను."

"అమ్మాయ్ శ్వేతా! వాడికి నువ్వైనా చెప్పు ఆడపిల్ల పెళ్లి అయ్యాక పుట్టింట వుండకూడదమ్మా. నువ్వు మొదట బయలుదేరు. తరవాత వాడంతటవాడే వస్తాడు."

"క్షమించండి అత్తయ్యా! పెళ్ళైన ఆడపిల్ల పుట్టింట వుండకూడదన్నది వాస్తవమే. కానీ భర్త అడుగుజాడలలోనే భార్య నడవడం ధర్మం. ఆయన రాకుండా నేను రావడం భావ్యం కాదు."

కుక్క కాటుకి చెప్పదెబ్బలాగా అదీ మెత్తని చెప్పదెబ్బలాగా వుండడంతో అత్త ఏమీ మాట్లాడలేకపోయింది. అయినా 'అహం' ఊరుకోలేదు.

"ఇల్లరికం అల్లుడిలా ఎన్నాళ్లుంటాడో వుండనివ్వండి. మనం పోదాం పదండి..." అని ధుమధుమలాడుతూ వెళ్లిపోతున్న తల్లిదండ్రులను బాధతో చూస్తున్నాడు శరత్.

"బాధపడకు బాబూ... నాలుగు రోజుల్లో అన్నీ సర్దుకుంటాయి. నేననుకున్న దానికంటే రెండు మాటలు ఎక్కువగానే అని పథకాన్ని విజయవంతం చేశావు. ఇంటికి వెళ్లాక అమ్మా, నాన్నగారికి నువ్వన్న మాటలే మాటిమాటికీ గుర్తుకొస్తాయి చూడు. ఆ మాటలలోని నిజం గ్రహించి పశ్చాత్తాపపడతారు" అన్నారు ఆశాభావంతో శ్వేత తండ్రి.

అలా జరగాలని కోరుకుంటున్నట్టుగా మౌనంగా వుండిపోయారు శరత్, శ్వేత.




విజయవంతమైన చికిత్స

## తెల్ల మచ్చలు

మా శక్తివంతమైన మరియు త్వరితగతిన ఫలితమునిచ్చెడి ఆయుర్వేద చికిత్స ప్రారంభించిన 36 గంటలలోగా మచ్చల యొక్క రంగు మారటాన్ని మీరే గమనిస్తారు. మరియు త్వరలోనే సహజమైన శరీరపు రంగులోనికి మారుతుంది. మీరు ఇతర చికిత్సల ద్వారా విసిగిపోయి వున్నట్లైతే ఒక్కసారి మా వైద్య చికిత్స ద్వారా ప్రయత్నించండి. సంతృప్తి చెందండి! రోగులు చికిత్స కొరకు వారి వ్యాధి వివరాలను దయచేసి వ్రాయండి. పరీక్షించే నిమిత్తం ఒక ప్యాకెట్ మందు ఉచితంగా ఇవ్వబడుతుంది.

**GAUTAM CHIKITSALAY (W.W.)**
**P.O. Katri Sarai (Gaya)**
**Pincode: 805 105**

## నెరసిన జుట్టు

నల్లగా మారుతుంది

హెయిర్ డైతో పనిలేదు. మా ఆయుర్వేద చికిత్స ముందుగా జుట్టు నెరవటాన్ని మరియు వెంట్రుకలు రాలిపోవడాన్ని అరికడుతుంది. నెరసిన జుట్టు సహజమైన నలుపు రంగులోకి మారుతుంది. ఈ చికిత్స ద్వారా కోమలమైన మీ వెంట్రుకలు పొడుగ్గా పెరుగుతాయి. మెదడును చల్లగా వుంచుతుంది. కంటి బలహీనతలను అరికట్టడంలో ఎంతో ఉపయుక్తమైనది. ఒక కోర్సు ధర రూ. 80/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**GAUTAM CHIKITSALAY (O.J)**
**P.O. Katri Sarai (Gaya)**
**Pincode - 805 105.**